క్లుప్తంగా

వేగవంతంగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలు



శిరివెళ్లలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులు

శిరివెళ్ల: మండలంలో గడప గడపకు మన ప్రభుత్వ నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మంగళవారం శిరివెళ్లలోని తెలుగుపేట, వడ్ల పేటలో రూ. 7.30 లక్షలతో రోడ్ల నిర్మాణాలను ఉప సర్పంచ్ ఇంతియాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఆర్ ఏఈ రవికుమార్ మాట్లాడుతూ.. మండలంలోని గుండంపాడులో రూ. 20 లక్షలతో 6 రోడ్లు, గుంప్రమాన్‌దిన్నెలో రూ. 20 లక్షలతో 6, మోత్కలపల్లెలో రూ. 7 లక్షలతో ఒక రోడ్డు, రూ. 13 లక్షలతో చెన్నూరులో ఒక రోడ్డు ఇటీవలే పూర్తయ్యాయని తెలిపారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

దొర్నిపాడు: నంద్యాల సెయింట్ వెర్బర్గ్స్, సీఎస్ఐ మిషన్ ఆస్పత్రిలో ఈ నెల 7,8,9 తేదీల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నంద్యాల డయాసిస్ మెడికల్ కమిటీ మెంబర్, హరివరం ఫాస్టరేట్ కౌన్సిల్ సభ్యుడు శ్రీరాముల అబ్రహం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గైనిక్, దంత, కంటి, ఈఎన్‌టీ, ఊపిరితిత్తులు, కీళ్ల నొప్పులు, చిన్నపల్లల వైద్య నిపుణులు రానున్నట్లు తెలిపారు. బనగానపల్లె, ఆళ్లగడ్డ, నంద్యాల, నందికొట్కూరు, పాణ్యం, డోన్ నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధునిక సౌకర్యాలతో స్త్రీశక్తి భవనం



భవనాన్ని పరిశీలిస్తున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

గోస్పాడు: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న స్త్రీశక్తి భవనాన్ని పీడీ శ్రీధర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి మన కేంద్రంలో ఐకేపీ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో మండల స్థాయిలో ఐకేపీ కార్యాలయం అందుబాటులోకి వస్తే పొదుపు మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సెబ్ అధికారులు

బొమ్మలసత్రం: మహానంది మండలం అబ్బీపురం గ్రామ శివారులో అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 203 మద్యం బాటిళ్లను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నంద్యాల సెబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ విశ్వనాథ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. బండిఆత్మకూరు మండలం బి కోడూరు గ్రామానికి చెందిన బాలుడు, వెంకటేశ్వరరెడ్డి మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి మద్యం బాటిళ్లు తరలిస్తున్నట్లు ఈఎస్ రామమోహన్‌రెడ్డికి అందిన సమాచారం మేరకు అబ్బీపురం వద్ద తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ క్రమంలో బాలుడు, వెంకటేశ్వరరెడ్డి వద్ద 203 ఏపీ మద్యం బాటిళ్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



విశేష అలంకరణలో శ్రీకాళికాంబ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీ చౌక్‌లోని శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతం, నిమ్మ, వేప రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేశారు. మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

పేదలందరికీ ఆరోగ్య సురక్ష

- చాగలమర్రి ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి
- వైద్య శిబిరంలో 351 మందికి సేవలు

చాగలమర్రి: పేదలందరికీ స్థానికంగానే వైద్య సేవలందించాలనే ఉద్దేశంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం చాగలమర్రి-1 సచివాలయం పరిధిలోని ప్రజలకు స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో సుమారు 402 మంది వైద్య సేవలు పొందినట్లు ఎంపీడీఓ తెలిపారు. చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు నజ్మా, చిన్నపిల్లల వైద్య నిపుణులు సురేష్, కంటి వైద్య సహాయకురాలు సౌజన్య వైద్య సేవలు అందించారు. సుమారు 402 మంది ఓపీ నమోదు చేసుకోగా వారిలో 34 మంది పిల్లలు, 213 మంది మహిళలు, 8 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. సుమారు 45 మందికి రక్త పరీక్షలు చేశారు. 52 మందికి కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ గువ్వ రామలింగేశ్వరరెడ్డి, సీహెచ్ఓ మహబూబ్ హుసేన్, ఫార్మాసిస్ట్ రాజేష్, చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ పాల్గొన్నారు.



గోస్పాడు: సాంబవరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యుడు

పేరూరులో 106 మందికి వైద్య పరీక్షలు

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శ్రావణి, షబ్బీర్ వలి తదితరులు 106 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో నిర్వహించే ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోనేటి దేవదానం, ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ, కార్యదర్శి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ కోనేటి వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలందరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని ఎంపీడీఓ అనసూయ, ఎంఈఓ అబ్దుల్ కరీం అన్నారు. మండలంలోని సాంబవరం గ్రామంలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వెంకటేశ్వర్లు, నర్మద, క్రాంతి చైతన్య, మురళీ మనోహర్ వైద్య సేవలు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా గ్రామాల్లో ప్రత్యేక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరం ద్వారా 252 మందికి వైద్య పరీక్షలు, 34 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఐజయ్య, ఎంపీటీసీ భారతి, పార్టీ నాయకులు బోరెడ్డి గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహన రికార్డులు తప్పనిసరి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

గోస్పాడు: వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవాలని ఎస్ఐ మల్లికార్జున అన్నారు. గోస్పాడులో మంగళవారం వాహనాల తనిఖీ చేశారు. వాహన రికార్డులను పరిశీలించారు. వాహనదారులకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని సూచించారు. రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని, మత్తు పానీయాలు తీసుకోకూడదని తెలిపారు. రికార్డులు సక్రమంగా లేని 10 వాహనాలను గుర్తించి వారికి రూ.1350 జరిమానా విధించారు.

అహోబిలేశా.. గోవిందా



పల్లకిపై విహరిస్తున్న స్వామివారు

ఆళ్లగడ్డ: పార్వేట ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అహోబిలేశుడు పట్టణంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీజ్వాలానారసింహుడు, శ్రీప్రహ్లాదవరదస్వామికి భక్తులు పూజలు చేశారు. అహోబిలేశా.. గోవిందా నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు.

జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి

- ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్ తులసమ్మ
- రూ.1.20 కోట్లతో డ్రైనేజీ పనులకు భూమి పూజ

చాగలమర్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామాల అభివృద్ధి జరుగుతున్నట్లు చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్ తులసమ్మ, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ షేక్ బాబులాల్, పార్టీ మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డి అన్నారు. చాగలమర్రి సచివాలయం-3 పరిధిలో రూ.1.20 కోట్లతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మండలంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సహకారంతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఒక్క చాగలమర్రి గ్రామంలోనే ఇప్పటి వరకు రూ.3 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేపట్టినల్లు చెప్పారు. జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు చెప్పే కాకమ్మ కథలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ఆయనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సాక్ష్యాధారాలు లేకుండా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుర్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓ నాగమణి, ఏఈ జగ్గయ్య, డైరెక్టర్ జాబీర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, వార్డు సభ్యులు జ్యోతి, అబ్దుల్లా, ఎంపీటీసీ బబ్లూ షోయబ్ పాల్గొన్నారు.



చాగలమర్రిలో డ్రైనేజీ కాలువ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

పంచాయితీ అయితే ఇంటికి రాండి

- బాధితులను గద్దించిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



ప్రధాన రహదారిపై నిలిపేసిన ఆర్టీసీ బస్సు



న్యాయం చేయాలని ప్రశ్నిస్తున్న బాధితులు

రుద్రవరం: ఏదైనా పంచాయితీ అయితే ఇంటి వద్దకు రావాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ దేవగుడి రహిమాన్ కుటుంబ సభ్యులను గద్దించారు. మేజర్ పంచాయతీ రుద్రవరంలో మంగళవారం భూమా అఖిలప్రియ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరుతో గ్రామంలోని పలు కాలనీల్లో ఇంటింటికి వెళ్లారు. విషయం తెలుసుకున్న దేవగుడి రహిమాన్ కుటుంబానికి చెందిన మహిళలు ఆమెతో మాట్లాడాలని గుమికూడారు. ఇంతలో అఖిలప్రియ అటు రాగానే ఆమె వద్దకు వెళ్లి గతంలో తమ పంచాయితీకని వచ్చిన మావారి నుంచి దాదాపు రూ.1.35 కోట్లు తీసుకున్నారని, ఆ డబ్బులు ఇప్పించి మాకు న్యాయం చేయాలని అడిగారు. ఆ విషయం వినగానే ఆమె మండి పడుతూ ఇలాంటివి రోడ్డుపైన కాదు ఇంటి వద్దకు వచ్చి మాట్లాడాలని చెప్పి తోసుకుంటూ ముందుకెళ్లారు. అయితే బాధితులు ఎలాగైనా ఆమెతో మాట్లాడాలని భీష్మించారు. తిరిగి వచ్చే సమయంలో ఎలాగైనా మాట్లాడాలని ప్రధాన రహదారికి అడ్డుగా మోటార్ సైకిళ్లను నిలిపారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో ఆళ్లగడ్డ, శిరివెళ్ల సీఐలు, పోలీసు బలగాలతో అక్కడికి చేరుకున్నారు. ఇంతలో అఖిలప్రియ అటుగా రావడంతో బాధిత మహిళలు మా సొమ్ము ఇప్పించి మాకు న్యాయం చేయాలని అడగ్గా వారికి సమాధానం చెప్పక పోలీసుల సాయంతో బయటపడ్డారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు మాట్లాడుతూ కుటుంబానికి జరిగిన అన్యాయానికి న్యాయం చేయలేక కనీసం మాట్లాడకుండానే వెళ్లి పోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఏడాదిన్నర క్రితం పంచాయితీకని పిలిపించి ఇంటికొచ్చిన వారి నుంచి రూ.1.35కోట్ల నగదును తీసుకున్నారని, అంత సొమ్ము పోవడంతో తాము పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావన్నారు. బయటి వ్యక్తుల నుంచి తీసుకొచ్చిన సొమ్మని, వారు తమ అప్పు చెల్లించాలని అడుగుతుంటే సమాధానం చెప్పలేక నలిగి పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ

దొర్నిపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా నాలుగున్నరేళ్లలో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థతో ప్రజల గడపకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని తెలిపారు. జెడ్పీటీసీ శకుంతల మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కొండాపురం సర్పంచ్ మాధవీలత భాగ్యనగరం గ్రామానికి విద్యుత్ స్తంభాలు కావాలని కోరగా ఇస్తామని ఏఈ రామమోహన్ తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సర్వసభ్య సమావేశం చక్కటి వేదిక అని అలాంటి కార్యక్రమానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు గైర్హాజరు కావడం సరికాదని ఈఓపీఆర్డీ శ్రీనివాసులు అన్నారు. అలాంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రబీలో సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ సునీత అన్నారు. సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంఈఓ అబ్దుల్ కరీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, పశువైద్యాధికారి ధనుంజయుడు, ఎంపీటీసీలు షాజహాన్, శీలం పార్వతి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి


సమస్యలు పరిష్కరించాలని వినతి

నంద్యాల(సిటీ): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా నంద్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, వాటర్ వర్క్స్ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, కమిషనర్ నిరంజన్‌రెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, కృష్ణయ్య, భాస్కరాచారి, రామకృష్ణ, ఆదాము, బీబి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదు, ఇంటర్ తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామ్మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024-25 ఏడాదికిగాను పాఠశాలలోని ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్ ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4 తరగతులు చదివిన విద్యార్థులు ఐదోతరగతి ప్రవేశానికి అర్హులన్నారు. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రథమ ఏడాదిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న మణిశేఖర్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీ ఎన్‌జీఓస్ అసోసియేషన్ నంద్యాల తాలూకా అధ్యక్షుడు మణిశేఖర్‌రెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్, జీపీఎఫ్ తక్షణమే అందించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, కార్యదర్శి హుసేన్‌రెడ్డి, నర్సారెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బరాయుడు, పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శివనాగిరెడ్డి, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న ఓంకారంలో బహిరంగ వేలం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారం ఆలయంలో ఈ నెల 14వ తేదీన బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులు పాదరక్షలు భద్రపరచుకునేందుకు, టెంకాయల విక్రయానికి, ఐస్ క్రీమ్ బండ్లు పెట్టుకునేందుకు, కూల్ డ్రింక్స్ అమ్మకానికి వేలాలు ఉంటాయని పేర్కొన్నారు. వేలాల్లో పాల్గొనాల్సిన వారు రూ.10,000 డిపాజిట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

17న కోడింగ్ మారథాన్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 17వ తేదీ గూగుల్ డెవలపర్ స్టూడెంట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కోడింగ్ మారథాన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరించారు. అన్ని కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. గూగుల్ డీఎస్సీ నుంచి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు పంపిణీ చేస్తామని తెలిపారు. వివరాల కోసం క్లబ్ అడ్వైజర్ రాకేష్‌బాబును 9100076679 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. కళాశాల ఎండీ దినేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.



కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వేలం పాటలో రూ.10 లక్షల ఆదాయం



రుద్రవరం కలప డిపోలో వేలం పాట నిర్వహిస్తున్న అటవీశాఖాధికారులు

రుద్రవరం: అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన వెదురు, కలపకు రుద్రవరం కలప డిపోలో మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఇందులో ప్రభుత్వానికి రూ.10.08 లక్షల ఆదాయం సమకూరినట్లు సీఎఫ్ఓ మూర్తి, నంద్యాల డీఎఫ్ఓ అనురాగ్ మీనా తెలిపారు. మొత్తం 40,500 వెదుర్లకు వేలం నిర్వహించగా రూ.9.95,400, మూడు లాట్ల కలపకి వేలం నిర్వహించగా రూ.12,800 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.

పెద్ద పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

నల్లమల అటవీ ప్రాంతంలో పెద్ద పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. గతంలో 50 నుంచి 60 ఉండేవన్నారు. ప్రస్తుతం 80 నుంచి 90 వరకు ఉన్నాయని వెల్లడించారు. గతంలో పెద్ద పులుల సంచారం మహానంది వరకు ఉండేదని, ప్రస్తుతం రుద్రవరం రేంజి దాటి కడప వరకు వెళ్లినట్లు తెలిపారు. అడవిలో అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్లు, వన్య ప్రాణుల సంరక్షణకు ఫైర్‌వాచర్ల నియామకం, అడవి జంతువుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జంతువులను వేటాడకుండా ఉండేందుకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

రంగస్థల కళాకారుడికి నివాళి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక భగత్‌సింగ్ గ్రంథాలయంలో ప్రముఖ రంగస్థలం కళాకారుడు లొద్దిపల్లె అల్లా బక్ష్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురసం జిల్లా అధ్యక్షుడు రఫీ, జిల్లా కార్యదర్శి మాబుబాషా మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలు రంగస్థలం సేవలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆంధ్ర నాటక రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 2008లో నందమూరి తారక రామారావు రంగస్థలం పురస్కారంతో పాటు అనేక పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. కళాకారులు బాల ఉసేన్, శివరామిరెడ్డి, ప్రసాద్, రాజగోపాల్ రెడ్డి, బీకే రాముడు, నరసింహులు, నాగేషుడు బీవై రమణ, గోకారి అల్లా బక్ష పౌరాణిక పద్యాలు పాడి అందరినీ అలరించారు.



అల్లాబక్ష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

- ఆళ్లగడ్డ రూరల్ సీఐ

చాగలమర్రి: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని.. గ్రామస్తులంతా శాంతియుతంగా మెలగాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతునాయక్ అన్నారు. మంగళవారం చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండ్ వద్ద ప్రజలతో మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న విషయాలకు గొడవలు సృష్టించుకోవడం వల్ల గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని తెలిపారు. ఎవరైనా రెచ్చగొట్టే ధోరణిలో వ్యవహరిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



చాగలమర్రిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ హనుమంతునాయక్

'పది' పరీక్షా కేంద్రాల పరిశీలన

మహానంది: పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని నంద్యాల డీఈఓ సుధాకర్ రెడ్డి సూచించారు. మండలంలోని తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌తో పాటు జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు ఈ రెండు కేంద్రాల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయన్నారు. అందులో భాగంగానే పరిశీలించామన్నారు. మండల విద్యాశాఖాధికారి రామసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయులతో వివిధ అంశాలపై చర్చించారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వీడాలి

నంద్యాల(సిటీ): పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వం వీడాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య వారోత్సవాలను ఆయన పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. నీటి సమస్య రాకుండా కొళాయిలను, నీటి పైపుల లీకేజీలను గుర్తించాలన్నారు. ప్రతి వార్డులో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయిస్తూ దోమలను అరికట్టాలన్నారు. కమిషనర్ వెంట శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి ఉన్నారు.



14వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్